# కొరోనావైరస్ వ్యాధి-2019 (కొవిడ్-19): ప్రస్తుత పరిస్థితి, ప్రజా ఆరోగ్య ఉద్యమ సూచనలు

జనవిజ్ఞాన వేదిక (Member AIPSN); ప్రజారోగ్య వేదిక (Chapter Janaswasthya Abhiyaan)

1. కొరోనావైరస్ ప్రజలలో వేగంగా వ్యాపిస్తూ మూడవ దశలోకి ప్రవేశించిన సూచనలు కనిపిస్తున్నాయి. రెండవ దశలో ఉండగా వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో కొన్ని లోపాలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా విదేశీ ప్రయాణికులపై నిబంధనలు అమలు చేయడంలో, వారిపై గృహ నిర్బంధాలు అమలు చేయడంలో తగిన కృషి జరగనందున వైరస్ వ్యాప్తిని అరికట్టలేక పోయాం. వైరస్ వ్యాప్తిని నిరోధించే ప్రయత్నాలు కొరోనావైరస్ వ్యాధిని ( కొవిడ్-19) పూర్తిగా రూపుమాపలేవు, దాని వేగాన్ని కొంతవరకూ తగ్గించగలవంతే.

2. ఈ వ్యాధి వ్యాప్తిపై ప్రభుత్వం ప్రజలకు తగిన సమాచారం అందించలేదు. మనదేశంలో కొవిడ్-19 వ్యాధి నిర్ధారణ పరీక్షలు చాలా తక్కువ సంఖ్యలో జరుగుతున్నందున కేసుల సంఖ్య తక్కువగా ఉన్నట్టు కనిపిస్తున్నది. శ్వాసకోశ వ్యాధులను గుర్తించే ''ఇన్ఫ్లుయంజా నిఘా వ్యవస్థ'' గణాంకాల ప్రకారం ఇటువంటి కేసుల సంఖ్య గత రెండు నెలల్లో గణనీయంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితిలో ఈ పెరుగుదల కొవిడ్-19 వ్యాప్తిని సూచిస్తుందని మేం భావిస్తున్నాం. ప్రభుత్వం ఫిబ్రవరి 23 నుంచి ఈ గణాంకాలను బహిరంగ పరచడం ఆపివేసింది. ప్రజలలో భయాందోళనలు నివారించడానికి ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చు. కానీ దీని మూలంగా రానున్న ఉత్పాతాన్ని గుర్తించి వైద్య వర్గాలు సకాలంలో సన్నద్ధం అవడంలో లోపం జరుగుతుంది. ప్రజలకు రానున్న ప్రమాద తీవ్రత తెలియక తగిన జాగ్రత్తలు తీసుకోరు. కొవిడ్-19 లక్షణాలతో పరీక్షల కోసం ఆసుపత్రులకు వస్తున్న రోగులను ఇతర రోగుల నుంచి వేరు చేసే ఏర్పాట్లు తగిన విధంగా లేనందున ఆసుపత్రులలే కొరోనావైరస్ వ్యాపించే కేంద్రాలుగా మారిపోయే అవకాశం ఉన్నది. తక్షణమే ఆసుపత్రులలో కొవిడ్-19 లక్షణాలు ఉన్న రోగులను ఇతర రోగుల నుంచి వేరు చేసే ఏర్పాట్లు చేయాలి. అలాగే ఇన్ఫ్లూయంజా నిఘా వ్యవస్థ ద్వారా సేకరిస్తున్న గణాంకాలను బహిరంగ పరచాలి. కొవిడ్-19 వ్యాధిగ్రస్తుల వివరాలను జిల్లాస్థాయిలో నమోదు చేసి ఆ సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి. తద్వారా జిల్లా స్థాయిలో వైద్య వ్యవస్థ సన్నద్ధత మెరుగు పడుతుంది.

జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో వైద్య వ్యవస్థల సన్నద్ధతను పరిశీలించి ప్రభుత్వానికి తగిన సూచనలు ఇవ్వడానికి మా వర్కింగ్ గ్రూప్ కృషి చేస్తున్నది.

3. ప్రభుత్వానికి మా విజ్ఞప్తి:

ప్రజలకు సమాచారాన్ని అందుబాటులో ఉంచండి. వారిలో అనవసర భయాందోళనలు వ్యాపించకుండా చేసే కృషికి మేం సహకరిస్తాం. రోగులను గుర్తించడం, విడిగా ఉంచడం, పరీక్షించడం, చికిత్స అందించడం, ప్రజలను గృహాలకు పరిమితం చేయడంవంటి వివిధ దశలలో జరగవలసిన కృషిలో పౌర సమాజ సంస్థల, ముఖ్యంగా ప్రజారోగ్య ఉద్యమ సంస్థలు, సైన్సు ఉద్యమ సంస్థలు, ట్రేడ్ యూనియన్ల సహకారాన్ని ప్రభుత్వం వినియోగించుకోవాలి. ప్రజల భాగస్వామ్యం, వారి విశ్వాసం లేకుండా ఈ కృషి సఫలం అవ్వదు. లాక్ డౌన్లు, సోషల్ డిస్టెన్సింగ్, గృహ నిర్బంధం వంటివి ఈ వ్యాధి నిర్ధారణలో తప్పకుండా అవసరమే, కానీ అవి మాత్రమే సంపూర్ణ పరిష్కారం అన్నట్లుగా వ్యవహరించరాదని ప్రభుత్వానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాము.

4. వైద్య సిబ్బంది రక్షణకు అవసరమైన మాస్కులు, గౌన్లవంటి సామాగ్రి పెద్ద ఎత్తున సమకూర్చుకోవడానికి, 5000 వెంటిలేటర్లు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, కొవిడ్-19 కేసులను ఎదుర్కోడానికి ఆసుపత్రులను సన్నద్ధం చేస్తున్నదని, వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి జిల్లాస్థాయి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని మార్చి నెల మూడో వారంలో వార్తలు వచ్చాయి. ఇవన్నీ సరైన చర్యలే. కానీ ఈ చర్యలన్నీ రెండు వారాల క్రితమే తీసుకుని ఉండాల్సింది. తగిన సమాచారం అందుబాటులో ఉంటే ఈ వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తున్న ప్రాంతాలలో సకాలంలో నిర్దిష్ట చర్యలు తీసుకోవడానికి సాధ్యమైఉండేది. వారానికి అరవై వేలకు పైగా కొవిడ్-19 నిర్ధారణ పరీక్షలు చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్

మార్చి 22న మీడియాకు వెల్లడించారు. ఈ సంఖ్య కూడా సరిపోదని మేము భావిస్తున్నాము. కొవిడ్-19 వ్యాధి లక్షణాలు కలిగిన వారందరికీ ఈ పరీక్షలు నిర్వహించాలి. దానితోపాటు కొన్ని గుర్తించిన ప్రాంతాలలో విస్తృతంగా పరీక్షలు నిర్వహించాలి (దీనిని సెంటినెల్ సర్వైలెన్స్ అంటారు). తద్వారా ఈ వ్యాధి రాష్ట్రాలలో ఏ స్థాయిలో వ్యాపించి ఉందో సరైన సమాచారం లభిస్తుంది.

5. కొవిడ్-19 వ్యాధిని ఎదుర్కునే విషయంలో ప్రభుత్వ అవగాహన పరిమిత స్థాయిలోనే ఉన్నదని; పరికరాల తయారీ, కొనుగోలు, వినియోగం వంటి అంశాలలో ఎదురవ్వబోయే ఇబ్బందులను ముందుగా గుర్తించడం లేదని మేం ఆందోళన చెందుతున్నాము. దేశీయ అవసరాలకు అనుగుణంగా, దేశ స్వావలంబన పెంచే విధంగా మన విధానాలను, పారిశ్రామిక సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఎంతో కాలంగా మేం ప్రభుత్వానికి సూచిస్తూ వచ్చాం. వైద్య పరికరాలను సమకూర్చుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురవుతాయో మేం అంచనా వేయగలం. ఈ సంక్షోభ సమయంలో అభివృద్ధి చెందిన దేశాల నుంచి ఈ పరికరాల దిగుమతి ఖరీదైనదేగాక కష్టసాధ్యం కూడా.

ఈ అంశాలపై ఏర్పాటు అయిన మా వర్కింగ్ గ్రూప్ ప్రజలకు తగిన సమాచారాన్ని అందించడమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఏ సమయంలోనైనా తగిన సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటుంది.

6. రోగులను విడిగా ఉంచడం, క్వారంటైన్, సామాజిక దూరం అమలు చేయడంలో జరుగుతున్న లోపాల పట్ల మేం ఆందోళన వ్యక్తం చేస్తున్నాం. వ్యాధి లక్షణాలు ఉన్నవారిని స్వచ్ఛంద గృహనిర్బంధంలో ఉండవలసిందిగా సూచిస్తున్నారు. మనదేశంలో అనేక కుటుంబాలలో ఇది సాధ్యం కాదు. అటువంటి వారిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించాలి. అలానే దీనిలో ఇమిడి ఉన్న మానవ హక్కుల కోణాన్ని కూడా గమనంలోనికి తీసుకోవాలి. ఇటువంటి సంక్షోభ సమయాల్లో ప్రజాస్వామిక దేశాలలో కూడా అనివార్యంగా మానవ హక్కులు ఉల్లంఘించబడతాయి. పౌర సమాజ సంస్థల నుంచి సమాచారాన్ని, సూచనలను తీసుకోవడంద్వారా ఈ ఉల్లంఘనలను వీలైనంతగా నివారించవచ్చు. నైతిక కారణాలతోనే కాక వ్యూహాత్మక కారణాల రీత్యా కూడా ఇది ప్రాధాన్యత కలిగిన అంశం. ఉదాహరణకు ముంబై, ఢిల్లీ విమానాశ్రయాలలో దిగిన వారిని గృహనిర్బంధం విధించుకోవాలని సూచిస్తూ వారి చేతులపై స్టాంపులు వేశారు. విమానాశ్రయం నుంచి బయటకు రాగానే వారు తమ ఇంటిలో అడుగుపెట్టరు. ఎంతో దూరం ప్రయాణించి తమ స్వస్థలాలకు చేరుకోవాల్సి ఉంటుంది. అందులో ఎక్కువ మంది ప్రజా రవాణా ద్వారానే ప్రయాణించాల్సి వుంటుంది. ఆ సమయంలో వారి చేతిపై స్టాంపులు వారిని సాటి ప్రయాణీకుల ముందు దోషులుగా నిలబెడతాయి. అంతేకాకుండా వారు తమ ఇరుగు పొరుగు వారినుంచి వివక్షను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటువంటి చర్యలు కూడదని వారించింది. గృహ నిర్బంధాన్ని ఉల్లంఘించారనే ఆరోపణలతో పోలీస్ స్టేషన్లు కేసులు నమోదు చేయడం, వీధుల్లో కనిపించిన వారిని పోలీసులు దండించడం, కొవిడ్19 లక్షణాలతో వచ్చిన వారికి చికిత్స అందించడానికి ఆసుపత్రులు నిరాకరించడం వంటివి మరికొన్ని ఉదాహరణలు. వీటిని నివారించే ప్రయత్నం చేయకపోతే రానున్న వారాల్లో ఈ ధోరణి పెరిగిపోతుంది. దానితో వ్యాధి లక్షణాలు ఉన్నవారు, వ్యాధిగ్రస్తులను కలిసిన వారు స్వచ్ఛందంగా సమాచారం అందించకపోయే ప్రమాదం ఉంది.

ఈ అంశాలపై పనిచేసే మా వర్కింగ్ గ్రూప్ ప్రజలకు మరియు ప్రభుత్వానికి ప్రతి వారం ఈ సమాచారాన్ని అందిస్తుంది.

7. వ్యాధి నివారణకు ఉద్దేశించిన సమాచారం ఎక్కువగా ఎగువ, మధ్య తరగతి మరియు ఉన్నత వర్గాలకు మాత్రమే ఉద్దేశించబడినది. రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు, విధాన నిర్ణేతలు ఈ వర్గాలకు చెందినవారే అవడంతో వీరికి సంబంధించిన సూచనలే ఎక్కువగా వెలువడుతున్నాయి. దేశంలో అధిక సంఖ్యలో ఉన్న పేదలు, శ్రామికులు, దిగువ మధ్యతరగతి వారికి ఈ సూచనలు ఆచరణ సాధ్యం కానివి. ఈ సూచనలు పాటించకపోవడం ద్వారా కోరోనావైరస్ వ్యాప్తికి కారణం అవుతున్నారని పేద ప్రజలను దోషులుగా నిలబెట్టేందుకు ఈ ప్రచారం దారి తీయకూడదు. ఇలా చెబుతున్నామంటే అర్థం వ్యాధి నివారణలో వ్యక్తులకు, కుటుంబాలకు ఉన్న బాధ్యతను నిరాకరిస్తున్నామని కాదు. కోరోనావైరస్ వ్యాధినీ, మరణాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాల్సిందే.

వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఆచరణాత్మకంగా తగిన జాగ్రత్తలు తీసుకునేలా మా వర్కింగ్ గ్రూప్ మార్గదర్శకాలను రూపొందిస్తుంది. ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి ప్రజల మధ్య సహకారాన్ని, సంఘీభావాన్ని పెంపొందించడానికి ఈ గ్రూపు కృషి చేస్తుంది.

8. లాక్ డౌన్ పై కొన్ని ఆందోళనలు:

ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ ప్రజల హక్కులను ఉల్లంఘించడం ఒక అంశమైతే, లాక్ డౌన్ విధి విధానాలకు స్పష్టమైన, శాస్త్రీయమైన ప్రాతిపదిక లేకపోవడం మరొక అంశం. ప్రజలకు తగిన సమయం ఇవ్వకుండా లాక్ డౌన్ ప్రకటించడంతో ఆందోళనకు గురైన ప్రజలు సరుకుల కోసం షాపుల వద్ద బారులు తీరడం, సుదూర ప్రాంతాలలో పనిచేస్తున్న అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో రైళ్ళు, బస్సులలో తమ స్వస్థలాలకు ప్రయాణం కట్టడం వంటివి వైరస్ వ్యాప్తికి దోహదం చేసే అంశాలే. ఈ మహమ్మారి అంత త్వరగా అదుపులోకి రాకపోవచ్చునని, తగ్గినట్లే తగ్గి తిరిగి విజృంభించవచ్చునని ప్రజా ఆరోగ్య నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. దీనికి అనుగుణంగా లాక్ డౌన్ విధించడానికి, తిరిగి దానిని తొలగించడానికి ప్రభుత్వానికి తగిన ప్రణాళిక ఉండాలి. ఆసుపత్రులలో అవుట్ పేషంట్ సేవలు రద్దు చేయడం, ఆసుపత్రులకు చేరుకోడానికి రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పేదలు, బలహీన వర్గాల ప్రజల జీవనంపై ఈ లాక్ డౌన్ తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఈ వ్యాధి విరుచుకుపడే నాటికే ప్రజలు తీవ్రమైన ఆర్థిక భారాలతో సతమతమవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా కార్పొరేట్లకు ఉదారంగా పన్ను మినహాయింపులు, ఉద్దీపనలు అందజేయడంతో ఈ సంక్షోభ సమయంలో ఖర్చు చేయడానికి ప్రభుత్వం వద్ద తగిన నిధులు అందుబాటులో లేకుండా పోయాయి. విద్య, ప్రజారోగ్యం, సామాజిక సంక్షేమం వంటి రంగాలపై ప్రభుత్వం నామమాత్రపు నిధులు కేటాయిస్తూ వీటిని ప్రైవేటు పరం చేసింది. ఈ విధంగా ఇప్పటికే బలహీనపడిన వ్యవస్థపై కొరోనావైరస్ పులి మీద పుట్రలా విరుచుకుపడింది.

కొరోనా వ్యాధి వలన పొంచి ఉన్న సామాజిక ఆర్థిక సంక్షోభాన్ని నివారించడానికి ప్రజలు మరియు ప్రభుత్వం వైపు నుంచి జరగవలసిన కృషిని గుర్తించడానికి సైన్స్ ఉద్యమ సంస్థలు, కార్మిక సంఘాలతో కలిసి మా వర్కింగ్ గ్రూప్ కృషి చేస్తుంది.

9. కొరోనావైరస్ వ్యాధిని నిరోధించడానికి లాక్ డౌన్ మరియు సోషల్ డిస్టెన్సింగ్ మాత్రమే సరిపోతాయి అనే ధోరణి ఆందోళనకరం. అవి ఖచ్చితంగా అవసరమే, కానీ వాటితో పాటుగా ప్రభుత్వం చేపట్టవలసిన చర్యలు అనేకం ఉన్నాయి అనేది ప్రపంచ దేశాల అనుభవం. లాక్ డౌన్ ఏమేరకు ఫలితాలను ఇస్తుంది అనేది కూడా అనుమానమే. దక్షిణ కొరియా, తైవాన్ దేశాలు లాక్ డౌన్ విధించకుండానే ఈ సమస్యను పరిష్కరించుకున్నాయి. లాక్ డౌన్ విధించడం అనేది ప్రజారోగ్య వ్యవస్థను, ఆసుపత్రులను సిద్ధం చేసుకోవడానికి ప్రభుత్వానికి కొంత అదనపు సమయాన్ని ఇస్తుంది కానీ మొత్తంగా కరోనా వైరస్ ను రూపుమాపలేదు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. దేశమంతటా లాక్ డౌన్ విధించడం కాకుండా నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఏ జిల్లాలో ఈ వ్యాధి వేగంగా ప్రబలుతుందో గుర్తించి ఆయా జిల్లాలలో లాక్ డౌన్ విధించాలని మేం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రజలపై సానుభూతితో వ్యవహరించకుండా పోలీసులు, అధికారులు దురుసుగా, హింసాత్మకంగా వ్యవహరించడం ఆందోళనకరం. లాక్ డౌన్ విధించడంతో పాటుగా కొరోనావైరస్ పేరుతో ఇతర వైద్య సేవలు, టీ.బి., హెచ్.ఐ.వి., మాతా శిశు సంరక్షణ కార్యక్రమాలు వంటివి నిర్లక్ష్యానికి గురవడం ఆందోళనకరం. ఈ గడ్డు కాలంలో రోజువారీ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, వలస కూలీలను ఆదుకోడానికి తగిన స్థాయిలో సంక్షేమ పథకాలను రూపొందించలేదు. ఇటువంటి అశాస్త్రీయ లాక్ డౌన్ ద్వారా కాపాడబడే ప్రాణాల కంటే అనేక రూపాలలో ఇది కలిగించే దుష్ప్రభావాల వలన కోల్పోయే ప్రాణాలు అధికంగా ఉంటాయేమో!

- జన స్వాస్థ్య అభియాన్ & ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ (24-03-2020)

వివరాలకు సంప్రదించండి:

డా. సుందర రామన్ - 9987438253

డి. రఘునందన్ - 9810098621

సరోజిని ఎన్. - 9818664634

సులక్షణ నంది – 9406090595

**Websites: www.phmindia.org; www.aipsn.net**

**Twitter @jsa_india Facebook @janswasthyaabhiyan**

**Andhra Pradesh: జనవిజ్ఞాన వేదిక (Member AIPSN) www.jvvap.org email: gsjvvap@gmail.com**

**ప్రజారోగ్య వేదిక (Chapter Janaswasthya Abhiyaan)**